సాక్షి వికారాబాద్

మంగళవారం ౹ 30 ౹ జూలై ౹ 2024



భూములివ్వం

ఫార్మా కంపెనీలకు మా భూములు ఇచ్చేది లేదని దుద్యాల్ మండలంలోని పలు గ్రామాల రైతులు తేల్చిచెప్పారు. 10లో▸



పెద్దాస్పత్రికి పెద్ద దిక్కెవరో..!

తాండూరు జిల్లా ఆస్పత్రికి పెద్ద దిక్కు కరువయ్యారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. 10లో▸



పేరుకే క్రీడా ప్రాంగణం

పల్లెల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 11లో▸

రేపు వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

వికారాబాద్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.



అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు

మున్సిపాలిటీ : వికారాబాద్

కమిషనర్ : జాకీర్ అహ్మద్

తేదీ : 31-7-2024 (బుధవారం)

సమయం : ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
9849905910, 9398227053

ఉత్సవం.. శోభితం



ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి

ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని సోమవారం తాండూరు పట్టణంలోని శ్రీ కాళికాదేవి ఆలయంలో బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని అందంగా ముస్తాబు చేసి వీధుల్లో ఊరేగించారు. పోతరాజుల నృత్యాలు, భజన మండలి పాటలు, భాజాభజంత్రీల నడుమ జాతర వైభవంగా సాగింది. కాళికాదేవిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు రంగమెక్కే కార్యక్రమం నిర్వహించారు.

– తాండూరు టౌన్



పోతరాజుల నృత్యం

న్యూస్‌రీల్

సీసీఐ ఫ్యాక్టరీలో ఆగిన ఉత్పత్తి

సాంకేతిక సమస్యతో నిలిచిన పనులు



తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ శివారులో గల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీలో సిమెంట్ ఉత్పత్తి ఆగిపోయింది. సోమవారం క్లింకర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సిమెంట్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు ఫ్యాక్టరీ హెచ్ఆర్ ప్రతినిధి అమిత్ రంజన్ తెలిపారు. పరిశ్రమలో రోజూ 3 వేల మెట్రిక్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి జరుగుతుంది. దాదాపు 500 మంది రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తున్నారు. పరిశ్రమ తిరిగి ప్రారంభం కావడానికి మూడు, నాలుగు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

ఎస్పీ నారాయణరెడ్డి



ఎస్పీకి మొక్కను బహూకరిస్తున్న ఎస్ఐ

బషీరాబాద్: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పని చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంతటి వారైనా చట్టాలను చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించేది లేదన్నారు. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహభావంతో మెలగాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తామని తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమ రవాణా జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నదుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు సూచనలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు, నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ అశోక్, ఎస్ఐ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

పరిగి డీఎం కరుణశ్రీ



ఉద్యోగులను సన్మానించిన డీఎం కరుణశ్రీ

పరిగి: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని పరిగి డిపో మేనేజర్ కరుణశ్రీ అన్నారు. ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా సోమవారం డిపోలో ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చడానికి ఆర్టీసీ సిబ్బంది నిరంతరం కృషి చేస్తుందన్నారు. సంస్థకు లాభాన్ని తీసుకువస్తూ ఉన్నత స్థానంలో నిలబెడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రూట్.. రైట్

వికారాబాద్ - కృష్ణా రైల్వే లైన్ రూట్ మ్యాప్ ఖరారు

- సీఎం రేవంత్‌కు వివరించిన రైల్వే అధికారులు
- రూ.3,500 కోట్లతో 145 కిలో మీటర్లు..
- పలు సూచనలు చేసిన ముఖ్యమంత్రి



రూట్ మ్యాప్‌పై రైల్వే అధికారులకు సూచనలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్: వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్ రూట్ మ్యాప్‌ను ఆ శాఖ అధికారులు ఖరారు చేశారు. సోమవారం ఇందుకు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైల్వే శాఖ చీఫ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం వివరించారు. వికారాబాద్, పరిగి, కొడంగల్, నారాయణపేట, మక్తల్ మీదుగా రాయచూర్ వరకు లైన్ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. రూ.3500 కోట్లతో 145 కిలోమీటర్ల దూరం లైన్ ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వాకాటి శ్రీహరి, పర్ణికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్ల నిరీక్షణకు మోక్షం

వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. 40 ఏళ్లుగా ఊరిస్తూ వచ్చింది. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. రైల్వే లైన్ వేస్తే ఈ ప్రాంత ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగు పడుతుంది. అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అంతేకాకుండా రైల్వే శాఖకు ఆదాయం వస్తుంది. ఈ ప్రాంతానికి చెందిన విద్యావంతులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు గతంలో గణాంకాలతో సహా మంత్రులకు, అధికారులకు వివరించారు. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేయించాలనే ఉద్దేశంతో 1980–81 సంవత్సరంలో అప్పటి మహబూబ్‌నగర్ ఎంపీ, రైల్వేశాఖ సహాయ మంత్రి మల్లిఖార్జున్ సర్వేకు ఆదేశించారు. వికారాబాద్ నుంచి పరిగి, దోమ, సర్జఖాన్‌పేట, మద్దూరు, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణ వరకు రైల్వే లైన్ నిర్మాణానికి సర్వే చేయించారు. అయితే కొడంగల్ ప్రజల డిమాండ్ మేరకు రెండో పర్యాయం సర్వేకు కేంద్రం ఆదేశించింది. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మీదుగా రైల్వే లైన్ వేస్తే ఆదాయం వస్తుందని గణాంకాలను విశ్లేషిస్తూ ఇక్కడి ప్రజలు, అధికారులు కేంద్రానికి నివేదిక పంపించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి ఆదేశాల మేరకు రెండో సారి సర్వే జరిగింది. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే బాగుంటుందని నిపుణులు నివేదిక సమర్పించారు.

కొడంగల్ మీదుగా..

వికారాబాద్ జిల్లా నుంచి పరిగి, బొంరాస్‌పేట, కొడంగల్, కోస్గి, మద్దూరు, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణ, రాయచూర్ వరకు రైల్వే లైన్ నిర్మిస్తే కొడంగల్ నియోజకవర్గానికి న్యాయం జరుగుతుంది. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి సులువుగా ఉంటుంది. అంతేకాకుండా వివిధ రకాల సరుకుల రవాణా ద్వారా రైల్వేశాఖకు ఆదాయం వస్తుంది.

చైర్మన్ గిరి ఎవరికో?

- ధారూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ
- స్పీకర్ వద్దకు ఆశావహులు



ధారూరు వ్యవసాయ కమిటీ

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోననే చర్చ జోరుగా సాగుతోంది. ఈ పదవి జనరల్ కావడంతో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువగా పోటీ పడుతున్నారు. బీసీలు సైతం పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీకి అంకితభావంతో పనిచేసిన వారికి చైర్మన్ గిరి ఇవ్వాలా.. లేకుంటే ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారికి పదవి ఇవ్వాలా అనేదానిపై వాడీవేడి చర్చ సాగుతోంది. ఇప్పటికే సీనియర్లు, జూనియర్లు తమ అనుచరులతో కలిసి తమకే చైర్మన్ పదవి ఇవ్వాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిసింది. ఇంకా టైం ఉందిగా.. మీ అందరూ నా దృష్టిలో ఉన్నారు.. తప్పకుండా ఇస్తాను.. ఓపిక పట్టండి అంటూ స్పీకర్ వారికి నచ్చజెప్పి పంపిస్తున్నట్లు తెలిసింది.

రేసులో పలువురు

కొండాపూర్ కలాన్‌కు చెందిన జీ నారాయణరెడ్డి, కుక్కింద గ్రామానికి చెందిన పట్లోళ్ల రాములు రేసులో ఉన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి సొంత గ్రామ కేరెళ్లి నుంచి చెన్నారెడ్డి, మల్లారెడ్డి చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడికి పదవి ఇవ్వాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది. ఆ సామాజిక వర్గానికి చెందిన ఓ సీనియర్ నాయకుడు యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ద్వారా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఏఎంసీ చైర్మన్ పదవిని భర్తీ చేసిన తర్వాతే పీఏసీఎస్ చైర్మన్ పదవులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే స్థానిక సంస్థలకు ఎన్నికలు పూర్తయితే ఎంపీపీ, జెడ్పీ పదవులకు ఎవరెవరు అర్హులు, ఎవరికి కేటాయించాలన్న దానిపై కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ఏదో ఒక కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న అంతారం గ్రామానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి తండ్రి నర్సిరెడ్డికి ఇవ్వాలని కొంతమంది స్పీకర్‌ను కోరినట్లు తెలిసింది. ఎక్కువగా నాగారం, దోర్నాల్, ఎబ్బనూర్, కుక్కింద, కేరెళ్లి, ధారూరు, మున్నూరుసోమారం గ్రామాల నాయకులు పదవి కోసం పైరవీలు చేస్తున్నారు. చైర్మన్ పీఠం తోపాటు వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం నిత్యం పైరవీలు సాగిస్తున్నారు. ఎవరికి వారు తమ అనుయాయులతో కలిసి వెళ్లి మార్కెట్ కమిటీలో పదవులను పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మగా ఉన్న ధారూరు మండలం నుంచి మొదటి పదవి ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది.



పరిగి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు(ఫైల్)

ఎదురుచూపులు

- కొత్త పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న అర్హులు
- 2022లో అరకొర మంజూరు.. ఆపై కోత
- జిల్లాలో 20 వేలకు పైగా పెండింగ్ దరఖాస్తులు
- లబ్ధిపొందుతున్న వారు 1,09,833మంది

వికారాబాద్: కొత్త పింఛన్ల కోసం ఎదురు చూపులు తప్పడంలేదు. 2022లో అప్పటి ప్రభుత్వం నామమాత్రంగా పింఛన్లు మంజూరు చేసింది. జిల్లాలో 20 వేల పైచిలుకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పింఛను మొత్తం పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎప్పటి నుంచి అమలు చేస్తారు అనే దానిపై లబ్ధిదారులు ఆసక్తిగా ఎదురు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1,098,33 మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. ప్రతినెలా రూ.26.35 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. 41,104 మందికి వృద్ధాప్య పింఛన్లు, 12,592 మందికి దివ్యాంగ పింఛన్లు, వితంతువులు 49,492మందికి, నేత కార్మికులు 143, గీత కార్మికులు 418 మందికి, ఒంటరి మహిళలు 4,608, బీడీ కార్మికులు 38, ఫైలేరియా 199, డయాలసిస్ 94 మంది, ఏఆర్‌టీ 1145 మంది పింఛను ఇస్తున్నారు.

1,676 మంది పేర్ల తొలగింపు

గత ప్రభుత్వ హయాంలో 92,171 మందికి పింఛన్లు వచ్చేవి. 2022లో మరో 25,235 మందికి మంజూరు చేశారు. అప్పట్లో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేశారు. ఆ తర్వాత నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు అర్హులకు మంజూరు పత్రాలు ఇచ్చారు. ఆ వెంటనే విచారణ పేరుతో జిల్లాలో 791 పింఛన్లు గత ప్రభుత్వం తొలగించింది. అవి తొలంగించిన వారం రోజుల్లోనే మరో 885 మంది పేర్లు తీసేశారు.

కొత్త పెన్షన్ ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం

కొత్త పింఛన్ల కోసం వేల మంది ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినా పెన్షన్ ఊసెత్తకపోవడంతో అర్హులు ఆందోళన చెందుతున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న 20వేల మందితోపాటు వివిధ కారణాల వల్ల తొలగించిన 1,676 మంది, మరి కొందరు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని అర్హులు కోరుతుండగా.. ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తం పెంచాలని పింఛను పొందుతున్న వారు కోరుతున్నరాఉ.

మతతత్వ శక్తులతో జాగ్రత్తగా ఉండాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య

నందిగామ: దేశంలో మతతత్వ శక్తులు అభివృద్ధికి అడ్డంకిగా మారాయని, వాటితో అప్రమత్తంగా ఉంటూ తరిమికొట్టాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఈదులపల్లిలోని ఓ గార్డెన్‌లో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యనాయకులకు జిల్లా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సామెల్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో సోమయ్య మాట్లాడుతూ.. దేశంలో మతతత్వ రాజకీయాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయని, వాటితో దేశం అనేక రకాలుగా వెనుకబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ రాజకీయాలను తరమికొట్టేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నాయకులు రాజు, జగదీష్, యాదయ్య, శోభన్, కవిత, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీనునాయక్, ఈశ్వర్, కుర్మయ్య, వెంకటరమణ, లక్ష్మి, శంకర్, రాజు, జగన్, చరణ్ పాల్గొన్నారు.

సేకరణ ఘనం.. అభివృద్ధి శూన్యం

- ఫార్మాసిటీకి యాచారం మండలం నుంచి వేల ఎకరాలు
- అసైన్డ్ భూముల మధ్యన పట్టా భూములతో పేచీ
- కోర్టు కేసులతో ముందుకు పడని అడుగు
- పరిశ్రమలు లేవు, రోడ్డు మార్గం నత్తనడకనే..
- చిక్కుముళ్లతో వీడని గ్రహణం



యాచారం: ఫార్మాసిటీ ఏర్పాటుకు పెద్ద ఎత్తున భూసేకరణ జరిగినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి ఫార్మాసిటీకి 19,333 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించడానికి నిర్ణయించారు. ఇందులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లోనే 10 వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములు ఉన్నాయి. అప్పట్లో రైతుల నుంచి బలవతంగా భూసేకరణ చేశారు. అసైన్డ్ భూములకు ఎకరాకు రూ.8లక్షలు, ప్రభుత్వ భూముల్లో కబ్జా లో ఉన్న రైతులకు రూ.7.70లక్షలు, పట్టా భూము లకు రూ.12.50 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు పరిహారం చెల్లించారు. టార్గెట్ పూర్తి చేయడం కోసం అధికారులు రైతుల వెంటపడి అసైన్డ్, పట్టా భూములు సేకరించారు. అత్యధిక భూసేకరణ యాచారం మండలం నుంచి జరిగినప్పటికీ అభివృద్ధి పరంగా మాత్రం గ్రహణం పట్టింది. ఆయా గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోగా, మీరాఖాన్‌పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు నిర్మాణం చేపట్టాల్సిన వంద అడుగుల రోడ్డు విస్తరణ కూడా నిలిచిపోయింది.

ఆది నుంచి అవాంతరాలే..

యాచారం మండలంలోని నాలుగు గ్రామాల్లో ఫార్మాసిటీకి సేకరించాల్సిన 9,851 ఎకరాలకుగాను ఇప్పటి వరకు 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సేకరించారు. తాడిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లో 2,211 ఎకరాలకు సంబంధించి రైతులు తమ పట్టా భూములు ఇవ్వమని కోర్టును ఆశ్రయించగా వారికి కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆయా గ్రామాల్లోని అసైన్డ్ భూములు సేకరించిన మధ్యలోనే పట్టా భూములు ఉండడం.. పట్టా రైతులు కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడంతో ప్రస్తుతం అధికారులకు పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి అవకాశం లేకుండా పోతోంది. తాడిపర్తిలోని 118, 113, 114, 115, 116, 117 సర్వేనంబర్లలో 3,635 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించినప్పటికీ.. అసైన్డ్ భూముల మధ్యన ఉన్న పట్టా రైతులు తమ భూములు ఇవ్వమని కోర్టుకెళ్లారు. కుర్మిద్ద గ్రామంలోని 311, 92, 26,164 సర్వే నంబర్లలో 1,582 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించగా ఈ భూముల మధ్యలో పట్టా భూములు ఉన్నాయి. నక్కర్తమేడిపల్లి గ్రామంలోని 118, 131,213,184,247 సర్వే నంబర్లలో 2,104 ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు సేకరించగా ఆ భూముల మధ్యలో పట్టా భూములున్నాయి. వాటి ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు అధికారులకు తెగేసి చెబుతున్నారు. కొద్ది రోజులు క్రితం కుర్మిద్ద గ్రామంలోని సర్వే నంబర్ 92లో పర్యటించిన కలెక్టర్ శశాంకకు కూడా ఇదే విషయం తేల్చి చెప్పారు.

భర్త జ్ఞాపకార్థం నాటిన చెట్టుకు బర్త్ డే





విజయలక్ష్మి తన భర్త జ్ఞాపకార్థంగా నాటిన చెట్టు, నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

తాండూరు టౌన్: భర్త జ్ఞాపకార్థకంగా నాటిన మొక్కకు జన్మదిన వేడుకలు నిర్వహించారు తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి. భర్త గుర్తుగా పట్టణంలోని ఇంటి ఎదుట ఏడేళ్ల క్రితం ఓ మొక్కను నాటారు. రోడ్డు విస్తరణలో దాన్ని తొలగించాల్సి రావడంతో.. తిరిగి స్థానిక వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో నాటించారు. సోమవారం కోట్రిక వెంకటయ్య జయంతిని పురస్కరించుకుని చెట్టుకు కోటు తొడిగి, బెలూన్లతో అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మరో మూడు రకాల మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా మిద్దె తోట పెంపకం చేపడుతున్న కీర్తిశర్మ, మంకాల సరిత, శంకరమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా క్షేత్రం సైంటిస్ట్ డాక్టర్ సుధాకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


మహ్మద్ కైసర్ (ఫైల్)

తాండూరు టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ ఇంటర్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహ్మద్ కైసర్ ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగిరాక పోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి మౌలానా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మతిస్థిమితంలేని వృద్ధుడు..

చేవెళ్ల: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు కనిపించకుండా పోయాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని దామరగిద్ద గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా నిడుమూరు మండలం దేవరగోపవరం గ్రామానికి చెందిన తోక వెంకట మాణిక్యరావు తన కుటుంబంతోవలస వచ్చి దామరగిద్ద సమీపంలో ఓ ఫాంహౌస్‌లో కూలీ పని చేస్తున్నాడు. ఆయన తండ్రి తోక నాగేశ్వర్‌రావు (75)కు ఆరోగ్యం బాగాలేకపోవటంతోపాటు మానసిక పరిస్థితి సక్రమంగా లేదు. ఆదివారం పనులు చేసుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చిన వెంకటమాణిక్యరావు తండ్రి లేకపోవటంతో కంగారు పడ్డాడు. చుట్టుపక్కల వెతకగా, ఆచూకీ లభించకపోవడంతో సోమవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసినవారు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

కర్ణాటక నుంచి వచ్చిన యువతి..

అత్తాపూర్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువతి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ మల్కపురం నందగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో నివాసముంటున్న జ్యోతి సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటూ శివరాంపల్లిలో నివాసం ఏర్పరుచుకుంది. ఈమె కూతురు చంద్రమ్మ కర్ణాటక రాష్ట్రంలో హాస్టల్లో ఉంటూ చదువుకుంటుంది. సెలవులు ఉన్నాయంటూ శివరాంపల్లికి వచ్చిన చంద్రమ్మ ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తన ఇంటి సమీపంలో ఉన్న కాళిదాసును తాను ప్రేమిస్తున్నట్లు తల్లి జ్యోతికి చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొంది. కాళిదాసు పైనే అనుమానం వ్యక్తం చేసినట్లు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన రాసుల సాయి(19) రాత్రి 11గంటల సమయంలో వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు ఇబ్రహీంపట్నం మార్గంలో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని గంగాదేవి ఆలయం వద్ద రాగానే వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయి తలకు బలమైన గాయమవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన అదే గ్రామానికి చెందిన దొర్నాల రాజేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతుడు డిగ్రీ చదువుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

షాహి ఇమామ్ ఎండీ.ఉస్మాన్ లుథియాని


అవగాహన కల్పిస్తున్న ఉస్మాన్ లుథియాని

షాబాద్: యువత డ్రగ్స్‌కు, మాదకద్రవాల వినియో గంతో జీవితాలు నాశనమవుతున్నాయని పంజాబ్‌కు చెందిన షాహి ఇమామ్ మహమ్మద్ ఉస్మాన్ లుధియాని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన నగరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషనర్ నేషనల్ ప్రెసిడెంట్ జాకీర్ షరీఫ్‌తో కలిసి పాల్గొన్నా రు. ఈసందర్భంగాషాహి ఇమామ్ మహమ్మద్ ఉస్మాన్ లుధియాని మాట్లాడుతూ.. విద్యార్థులు,యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూ చించారు. డ్రగ్స్ వినియోగంతో జరిగేదుష్ప్రభావా లను వివరించారు. మాదక ద్రవ్యాలు అమ్మినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్ అంధకారమవుతుందన్నారు.

భూములివ్వం


ఫార్మాకు భూములు ఇచ్చేది లేదంటూ ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు(ఫైల్)

సాగుభూముల్లో కంపెనీల ఏర్పాటు ఎందుకు..?

- సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు
- ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని బాధితుల హెచ్చరిక

దుద్యాల్: పర్యావరణానికి, మానవ మనుగడకు ఇబ్బంది కల్గించే ఫార్మా కంపెనీలు మా ప్రాంతంలో నెలకోల్పొద్దు.. మా భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని బాధితులు ఖరాకండిగా చెబుతున్నారు. మండల పరిధిలోని లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచెర్ల తండా, రోటిబండా తండాల గ్రామాల్లో దాదాపు 1,274 ఎకరాల భూములలో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఈ ఫార్మా కంపెనీ ఏర్పాటుకు వందల మంది రైతుల భూములు కోల్పోతున్నారని ఆయా గ్రామాల ప్రజలకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరాల నుంచి భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నమని.. ఫార్మా కంపనీ పేరిట భూములు లాక్కునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

గ్రామాల వారీగా భూములు కోల్పోయే సర్వే నంబర్లు

గ్రామం	సర్వే నంబర్లు
హకీంపేట	1 నుంచి 254 వరకు
లగచెర్ల	131 నుంచి 134 వరకు
పోలేపల్లి	74 నుండి 85 వరకు
పులిచెర్ల తండా	111 నుంచి 128 వరకు
రోటిబండా తండా	102 నుంచి 130 వరకు

గత కొన్ని రోజులుగా రెవెన్యూ అధికారులు భూ సర్వేలు చేస్తుండడంతో పలుమార్లు అడ్డుకున్నామని వాపోయారు. ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రెవెన్యూ అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందించిన పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపెనీ వ్యర్థాలతో హాని

దుద్యాల్ మండలం పచ్చని పొలాలతో హాయిగా జీవనం సాగిస్తున్న తరుణంతో ప్రభుత్వం ఫార్మా కంపనీ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో ఈ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడుతోంది. ఈ ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తే ఆ కంపెనీ నుంచి విడుదలయ్యే వ్యర్థాలతో పర్యావరణానికి హాని కల్గించి రైతుల పొలాల్లో పంటలు పండవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ ఏర్పాటు చేస్తే ప్రమాదకరంగా తయారవుతోందనే వాదనతో కంపెనీ ఏర్పాటుకు ఈ ప్రాంత వాసులు విరుద్ధంగా ఉన్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఫార్మా కంపెనీని వ్యతిరేకిస్తున్నారు.


ఫార్మా కంపెనీ ఏర్పాటుకు సిద్ధం చేసిన నక్ష

బలవంతంగా లాక్కుంటే..

ఫార్మా కంపెనీ కొరకు సాగు భూములను బలవంతంగా లాక్కుంటే మాకు ఆత్మహత్యలే దిక్కని బాధిత రైతులు ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సాగు భూములు ఇచ్చి మేము ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. మా భూములు లాక్కుని మా బ్రతుకులు ఆగం చేయొద్దని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయమే ఆధారం



కొన్ని తరాల నుంచి భూములు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. పంటల ద్వారానే మా మనుగడ ముడిపడింది. కంపెనీల ఏర్పాటుకు మా భూములు ఇవ్వం. మా భూములు కావాలంటే ప్రాణాలు తీసి లాక్కోవాలి. ప్రాణం ఉండగా భూముల జోలికి ఎవ్వరూ రావొద్దు. – జమ్ముబాయ్, బాధితురాలు, రోటిబండ తండా

సర్వేకు వస్తే అడ్డుకుంటాం



దుద్యాల పచ్చని పొలాలకు, పాడి పరిశ్రమకు మారు పేరు. వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటు చేపట్టేందుకు ఇక్కడి రైతుల భూముల్లో సర్వేలు చేయడం బాధాకరం. కంపెనీ ఏర్పాటుకు భూములు ఇవ్వం. సర్వే నిమిత్తం అధికారులు వస్తే అడ్డుకుంటాం. – రాకం యాదయ్య, బాధితుడు, హకీంపేట

స్టాక్ రిజిస్టర్ నిర్వహణ తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

మోమిన్‌పేట: స్టాక్ రిజిస్టర్‌ను విధిగా నిర్వహిస్తూ స్టాక్ వివరాలను బోర్డుపై ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని సంగమేశ్వర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టాక్ వివరాలు, గోదాంలో ఉన్న మందులను, ఎరువులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆథరైజ్డ్ డీలర్ వద్ద కొనుగోలు చేసిన మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. నకిలీ మందులు అమ్మిన చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు తీసుకున్న మందులు, ఎరువులకు తప్పకుండా రసీదు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ రైతు విధిగా సాగు చేసిన పంటలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. లేదంటే తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలను ప్రభుత్వం విడతల వారీగా మాఫీ చేస్తోందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట ఏఈఓ పెంటయ్య తదితరులు ఉన్నారు.


ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ చేస్తున్న డీఏఓ గోపాల్

పెద్దాస్పత్రికి పెద్ద దిక్కెవరో..!

- బదిలీపై జడ్చర్లకు వెళ్లిన సూపరింటెండెంట్ కేవీఎన్ మూర్తి
- బాధ్యతల స్వీకరణకు వైద్యుల అనాసక్తి..?

తాండూరు: తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి పెద్ద దిక్కు కరువయ్యారు. ఆస్పత్రి ఆధీనంలో ఉన్న మాతాశిశు ఆస్పత్రి సూపరింటెండెంట్ వారం రోజులుగా పోస్టు ఖాళీగా మారింది. ఇక్కడ పనిచేసిన కేవీఎస్ మూర్తి బదిలీల్లో భాగంగా జడ్చర్లకు బదిలీ అయ్యారు. ఆస్పత్రిలో సివిల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ సివిల్ సర్జన్‌లు ఈ సీటుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో పోస్టు భర్తీ చేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రదీప్ సూపరింటెండెంట్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే వైద్యుల కోసం అన్వేషిస్తున్నారు. గతంలో సూపరింటెండెంట్ బాధ్యతలు నిర్వహించి స్వచ్ఛందంగా తప్పుకొన్న డాక్టర్.దర్మిది రవిశంకర్‌కు బాధ్యతలను కట్టబెట్టాలని వైద్యాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆసుపత్రికి ఇంచార్జి బాధ్యతలను డీసీహెచ్ఎస్ నిర్వహిస్తున్నారు.


జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

సర్పంచ్ ఎన్నికల్లో సత్తాచాటాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్

- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో సత్తాచాటాలని పార్టీ మహేశ్వరం నియోజవకర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కొత్త, పాత తేడా లేకుండా 31 గ్రామ పంచాయతీల్లో మూడు రంగుల జెండా ఎగురవేయాలన్నారు. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలనని సూచించారు. పార్టీ కోసం కష్టపడేవారికి భవిష్యత్‌లో తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు చేసిన రుణమాఫీ గురించి ప్రతీ కార్యకర్త లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. ఏ ఆపద వచ్చినా ప్రతీ నాయకుడు, కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటానని పార్టీ కేడర్‌కు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో . ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నజీర్, మాజీ ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వర్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, ఆవుల యాదయ్య, కావలి దశరథ, సీనియర్ నాయకులు ఇజ్రాయేల్, రఘుపతి, మల్లేష్ యాదవ్, కూన యాదయ్య, రాఘుందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, రాజు నాయక్, అంగోత్ కృష్ణ నాయక్, ప్రశాంత్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్, మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజు, బాల్‌రాజ్, హరికిషన్ గౌడ్, యాదయ్య, వెంకట్‌రెడ్డి, లాజర్, కుమార్, పాండు నాయక్, విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనితారెడ్డి అసంతృప్తి

పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో కేఎల్లార్ తీరుపై మాజీ జెడ్పీచైర్‌పర్సన్ అనితా రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం పార్టీ పదవులు ఆశిస్తున్న వారితో మాట్లాడించి.. అనితారెడ్డికి అవకాశం ఇవ్వకుండా కేఎల్లార్ ప్రసంగించి సమావేశాన్ని ముగించారు. తాను మహేశ్వరం జెడ్పీటీసీ గెలిచి జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యానని తనను అవమానించడం తగదని ఆమె ‘సాక్షి’తో ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ సంబురాల్లోనూ తానొక్కడే మాట్లాడి కార్యక్రమాన్ని ముగించారని ఇది సరికాదన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటేనే పార్టీ బలోపేతమవుతుందని ఆమె స్పష్టం చేశారు. మరోమారు ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని సూచించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

షాద్‌నగర్‌రూరల్: దళిత యువకుడు చించేటి శివకుమార్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలోని బాధితుడి ఇంటికి వచ్చి పరామర్శించారు. దాడికి సంబంధించిన కారణాలు తెలుసుకున్నుఆరు. అనంతరం దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దళితులను చిన్నచూపు చూస్తూ అంటరాని వారిగా పరిగణించడం సరికాదన్నారు. దళిత యువకుడు శివకుమార్‌పై బీసీ వర్గానికి చెందిన వారు దాడి చేసి కులం పేరుతో దూషించారని ఆరోపించారు. గ్రామంలో జరిగిన బోనాల ఉత్సవంలో దళితులు పాల్గొనడంతో ఓర్వలేక కొందురు కుల వివక్షతో దాడికి పాల్పడ్డారని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, మహేశ్, వినోద్, నర్సింహ, మల్లేశ్, శేఖర్, శివ, రాఘవేంద్ర, రాజు, శ్రీకాంత్, అనిల్, శరత్, అంజి, చిన్నయ్య, శ్రీకాంత్, రాజేశ్, శేఖర్, ప్రవీణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చార్మినార్ జోన్‌లో రాజేంద్రనగర్ సర్కిల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోనున్నట్లు సమాచారం అందుతోంది. ఇందుకోసం అధికారులు, రెవిన్యూ సిబ్బంది ముమ్మరంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు తమ వార్డుల వారీగా తగు ఏర్పాట్లు ప్రారంభించారు. అధికారులు ఆదేశించగానే ప్రతి ఇంటి సర్వేను చేపట్టనున్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తిపన్ను, భవన నిర్మాణాల అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తదితర వాటన్నింటిని పరిశీలించి నమోదు చేయనున్నారు. అనుమతులకు అదనంగా అంతస్తులు, నిర్మిస్తే వాటిని సైతం రికార్డు చేయనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ బయిలా ప్రకారం వీటికి సైతం ఆస్తిపన్నును జోడించనున్నట్లు తెలుస్తుంది. అదనపు అంతస్తులు నిర్మించిన వారు బీఆర్ఎస్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇందుకోసం అనేక మంది గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ అధికారులు ఈ సర్వే చేపడితే అందరికి లాభం చేకూరనుంది. ప్రభుత్వానికి సైతం అదనంగా ట్యాక్స్‌ల రూపంలో నగదు రానుంది.

కిషన్‌పల్లిలో భూ తగదా

అన్నదమ్ముల కుటుంబాల్లో పంచాయితీ

- పోలీసుల రంగ ప్రవేశం
- కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి ఉండాలని సూచన
- లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక

యాచారం: ఏళ్లుగా సాగుతున్న ఓ భూ వివాదం కేసు ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఘర్షణ జరిగే సమయంలో అందులోని ఓ వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. భూ వివాదం ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలి.. ఘర్షణలకు పాల్పడితే మాత్రం ఇరువురిపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాల్ అనుబంధ గ్రామం కిషన్‌పల్లిలో పాల బజారు అనే వ్యక్తికి సోమయ్య, మల్లయ్య సంతానం. పాల బజారుకు 736, 738, 757, 758, 759 సర్వే నంబర్లలో 36.29 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇట్టి భూమిని 1999లో గ్రామ పెద్దల సమక్షంలో సోమయ్యకు 18.22 ఎకరాలు, మల్లయ్యకు 17.12 ఎకరాల భూమి పంపిణీ చేశారు. సోమయ్య భాగానికి వచ్చిన భూమిలో పెద్ద బండరాళ్లు ఉండి సాగుయోగ్యంగా లేకపోవడంతో అదనంగా 1.10 ఎకరాల భూమిని ఇచ్చారు. నాటి నుంచి ఇద్దరూ భూమిని సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కొన్నేళ్ల తర్వాత సోమయ్య మనుమలు రాజు, మధూకర్ రాళ్లను తీసేసి చదును చేసినారు. ఈ భూమి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఉండడం.. అధిక డిమాండ్ ఉంటుందనే మళ్లీ భూ పంపకం చేపట్టాలని మల్లయ్య మనుమలు శ్రీకాంత్, రజినికాంత్ పలుమార్లు సోమయ్య వారసుల భూమిలో ఆక్రమించి దున్నడం, వారితో ఘర్షణ పడుతున్నారు. ఈ విషయంలో గతంలోనూ మల్లయ్య మనుమలపై కేసు నమోదయ్యాయి. మల్లయ్య కుమారు డు వెంకటయ్య రంగారెడ్డి జిల్లా కోర్టులో పార్టీషన్ గురించి సివిల్ కేసు వేశాడు. ప్రస్తుతం కేసు పెండింగ్‌లో ఉండగానే ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ విషయమై యాచారం సీఐ శంకర్‌కుమార్ ఇరువురిని పిలిచి భూ పంపిణీ విషయమై కోర్టు పరిధిలో ఉన్న దృష్ట్యా తీర్పు వచ్చే వరకు ఎవరి భాగంలో వాళ్లే ఉండాలని, ఘర్షణ పడి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఇరువురిపై కేసులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

పట్టుకోండి చూద్దాం!

మండల పరిధిలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పట్ట పగలే ఇళ్లు గుల్ల చేస్తున్నారు. నగలు, నగదు మాయం చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సీసీ కెమెరాలను సైతం లెక్క చేయకుండా ముఖాలు మాస్కులేసుకుని తమ కానిచ్చేస్తున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు

- మొయినాబాద్‌లో పెరుగుతున్న చోరీలు
- జంకుతున్న జనం
- పోలీసుల వైఫల్యమేనని ప్రజల ఆరోపణ



మొయినాబాద్ పోలీస్ స్టేషన్

మొయినాబాద్: మొయినాబాద్‌లో చోరీలు పెరుగుతున్నాయి. ఇళ్లు, షాపులు, ఆలయాలు టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా... ముఖం కనిపించకుండా జాగ్రత్త పడుతూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఆరు నెలలుగా వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. పోలీసుల నిఘా వైఫల్యంతోనే దొంగలు రెచ్చిపోతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

పగలు రెక్కీ..

మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోనూ వరుస చోరీలు జరుగుతున్నాయి. దుండగులు రాత్రి సమయాల్లో షాపులు, ఇళ్లు, దేవాలయాల్లో చోరీలకు తెగబడుతున్నారు. ఆరు నెలల క్రితం మొయినాబాద్ పెట్రోల్ బంక్ సమీపంలో రాత్రి పార్కు చేసిన కార్లు, ఇతర వాహనాల్లో బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. మూడు నెలల క్రితం బాకారం గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లడంతో పగలు రెక్కీ నిర్వహించిన దొంగలు రాత్రి ఇంట్లోకి చొరబడి ఐదు తులాల బంగారు, 120 తులాల వెండి ఆభరణాలు, రూ.3.50 లక్షల నగదు దోచుకెళ్లారు. మండల కేంద్రంలోని ఓ కళాశాల సెల్లార్‌లో నివాసముండే ఇంట్లోకి ఇద్దరు మహిళలు చొరబడి విలువైన పట్టుచీరలు, నగదు దోచుకెళ్లారు. రెండు నెలల క్రితం సురంగల్‌లోని కట్టమైసమ్మ ఆలయం వద్ద అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుడు హుండీని పగులగొట్టి అందులో ఉన్న డబ్బులు ఎత్తుకెళ్లాడు. ఆ తరువాత రెండు రోజులకే మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలోని హనుమాన్ ఆలయంలో హుండీని పగులగొట్టి డబ్బులు దోచుకెళ్లారు. వారం రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ స్టీల్, సిమెంటు షాపుల షటర్ తాళాలు పగులగొట్టి టీవీ, సెల్ ఫోన్ చోరీ చేశారు.


సీసీలోనూ చిక్కని ముఖాలు

చోరీ చేసే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఉన్నా దుండగులు జంకడం లేదు. ముఖానికి మాస్కులు వేసుకుని, సీసీ కెమెరాకు ముఖం చూపించకుండా జాగ్రత్త పడుతూ చోరీలకు తెగబడుతున్నారు. పోలీసులు చోరీ తర్వాత సీసీ కెమెరాలను పరిశీలించి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ కేసుల్లో దొంగల ముఖాలు సీసీ కెమెరాల్లో సరిగా కనిపించకపోవడంతో వారిని పట్టుకోలేకపోతున్నారు.

నిఘా వైఫల్యమే కారణమా?

తరచూ దొంగతనాలు జరగడానికి పోలీసుల నిఘా వైఫల్యమే కారణమంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో గస్తీ కాయాల్సిన పోలీసులు పార్టీలు జరిగే ఫాంహౌస్‌లకు వెళ్లి వసూళ్ల పనిలోనే ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. చోరీల నివారణకు ఉన్నతాధికారులు సైతం సరైన చర్యలు తీసుకోవడం లేదని.. అందుకే దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిఘా పెంచుతాం



మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాల నివారణకు నిఘా పెంచుతున్నాం. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించే ప్రయత్నం చేస్తున్నాం. రాత్రి సమయాల్లో గస్తీని పెంచుతాం. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరైనా అనుమానితులు గ్రామాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్